పెద్ద కొడప్‌గల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 11: జిల్లాలోని ఆయా మండలాల్లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పెద్దకొడప్‌గల్ గురుకుల సెంటర్‌లో 384 మంది విద్యార్థులకు గాను 348 మంది హాజరైనట్లు పాఠశాల చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని అధికారులు ఖజామొయినుద్దీన్, హెన్రీ తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

పిట్లంలో అమ్మవారికి పూజలు చేస్తున్న వైశ్య కులస్తులు

నస్రుల్లాబాద్/పిట్లం, ఫిబ్రవరి 11 : బీర్కూర్‌లో ఆర్యవైశ్యుల కుల దేవత వాసవి కన్యకాపరమేశ్వరీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య భవనంలో కన్యకాపరమేశ్వరీ మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అమ్మవారి చరిత్ర పారాయణం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ్యులు సునీల్, సంతోష్, వీరయ్య, రమేశ్, గోపి, సంగమేశ్వర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. పిట్లం మండలకేంద్రంలోని వైశ్య సంఘ భవనంలో అమ్మవారికి సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ మండల అధ్యక్షుడు బొడ్ల రాజు, గ్రామ అధ్యక్షుడు గంగా ప్రవీణ్, మహిళా అధ్యక్షురాలు ప్రేమల, సభ్యులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 11 : నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామ శివారులో ఉన్న త్రిలింగేశ్వర ఆలయ ఆవరణలో షెడ్డు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. భక్తుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో దాత ఏలేటి సురేశ్‌రెడ్డి సహకారంతో షెడ్డు నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ఫిర్యాదుల పెట్టెలు

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి/మాచారెడ్డి/భిక్కనూరు, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని కమాన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశామన్నారు. తాను అందుబాటులో ఉన్నా లేకున్నా ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏ సమస్య వచ్చినా కాగితంపై రాసి పెట్టెలో వేస్తే వారంలోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే పాల్వంచ మండలంలోని ఇసాయిపేట, మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్, భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు విపుల్ జైన్, లక్ష్మారెడ్డి, డాక్టర్ వీరేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో ఫిర్యాదుల పెట్టెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

పోలీస్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కస్టమ్స్, ఎక్సైజ్ డీఎస్పీ రంగధం

కస్టమ్స్, ఎక్సైజ్ డీఎస్పీ రంగధం

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : మాదకద్రవ్యాల రవాణా, క్రయవిక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కస్టమ్స్, ఎక్సైజ్ డీఎస్పీ రంగధం స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం మాదకద్రవ్యాల కేసుల పరిశోధన, నిందితులపై చేపట్టనున్న చర్యలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలీసు అధికారులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో ప్రథమ సమాచార నివేదిక మొదలుకొని నిందితులపై అభియోగ పత్రం వేసేంత వరకు చేపట్టే విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తిగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనలో పోలీసు శాఖ పాత్ర ముఖ్యమైనదని అన్నారు. నిషేధిత పదార్థాల విషయంలో పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన పోలీస్ అధికారులు

ఎన్నికల హామీలను త్వరగా నెరవేర్చాలి

మాట్లాడుతున్న ఎంసీపీఐయూ నాయకులు

దోమకొండ, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని ఎంసీపీఐయూ కేంద్ర కమిటీ సభ్యుడు ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దోమకొండలో జిల్లా కమిటీ సభ్యుడు మహిపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని, అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జబ్బార్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు రమేశ్, సదానందం, కరుణాకర్, ఫయాజ్, అరున్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన దళిత కులస్తులు

దోమకొండ, ఫిబ్రవరి 11 : దళితుడిపై దుర్భాషలాడిన వ్యక్తిపై ముత్యంపేట దళిత కులస్తులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముత్యంపేటకు చెందిన గొండ్ల నర్సింహులు ఒక సోషల్‌మీడియా పోస్టును స్టేటస్‌గా పెట్టుకున్నందుకు మహేందర్‌రెడ్డి కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పీ రాష్ట్ర ఈసీ మెంబర్ బాల్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, ఎంపీటీసీ రాజేశ్వర్, స్వామి, జీవన్, నరేశ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

పంట భూములే మందుబాబులకు అడ్డా

మందు బాబులు పడేసిన మద్యం బాటిళ్లు, ధ్వంసం చేసిన సీసాలు

- ఇబ్బంది పడుతున్న రైతులు
- శివారు ప్రాంతాలపై అధికారుల నిఘా కరువు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 11: మండలకేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామ శివారు ప్రాంతాలు మందుబాబులకు అడ్డాలుగా మారాయి. ఉదయం నుంచే మద్యం బాటిళ్లతో దర్జాగా మకాం వేస్తున్నారు. రాత్రివరకు తాగుతూ తూలుతున్నారు. మైకంలో అరుపులు, కేకలు వేస్తూ మద్యం బాటిళ్లను పగులగొట్టి హంగామా చేస్తున్నారు. దీంతో పంట పొలాలకు వెళ్లే రైతులు, మహిళలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మండలకేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఖాళీగా ఉన్న వ్యవసాయ భూములు మందుబాబులకు ప్రధాన అడ్డాలుగా మారాయని స్థానికులు వాపోతున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు బేగంపూర్ చౌరస్తా నుంచి వడ్లం వెళ్లే రహదారికి రెండువైపులా గుంపులుగా కూర్చొని మందు కొడుతున్నారు. ఆయా ప్రాంతాలు అర్ధరాత్రి వరకు సందడిగా మారుతున్నాయి. మద్యం తాగి ఖాళీ సీసాలను అక్కడే ధ్వంసం చేయడంతో అదే దారిగుండా కాలినడకన వెళ్లే వ్యవసాయ కూలీలకు గాజుముక్కలు గుచ్చుకొని గాయపడుతున్నారు. బెల్టుషాపుల్లో ఎప్పుడుపడితే అప్పుడు మద్యం లభించడంతో రాత్రింబవళ్లూ మద్యం సేవిస్తున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతో మందు బాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు. ఇకనైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి

- శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

నిజాంసాగర్, ఫిబ్రవరి 11: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సఫల ఆర్గనైజేషన్ సీఈవో, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి సూచించారు. మండలకేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో పైడి ఎల్లారెడ్డి ట్రస్ట్, సఫల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షలతో వాటర్ ప్యూరిఫయర్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కూడా ఓ సాధారణ కుటుంబం నుంచి శాస్త్రవేత్తగా ఎదిగినట్లు గుర్తుచేశారు. నవోదయ పాఠశాలను తొలిసారి చూశానని తెలిపారు. జపాన్ తరహాలో ఉన్న ఈ పాఠశాల, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎల్లారెడ్డిని ప్రిన్సిపాల్ సత్యవతి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు రామకృష్ణారెడ్డి, రాజారాం, శ్రీనివాస్, మద్దెల నవీన్, రమేశ్, ప్రమోద్, మేకల నరేశ్, గొట్టం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పాఠశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సఫల ఆర్గనైజేషన్ సీఈవో, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

ఘనంగా రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవం

పూజల్లో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో ఉన్న రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కోటగిరి, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974- 2000 సంవత్సరం వరకు విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కిడ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు కిడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిడ్స్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మైసమ్మ ఆలయంలో పూజలు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 11 : మండలంలోని మైలారం గ్రామ శివారులో ఉన్న మైసమ్మ ఆలయంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో వన భోజనాలు ఏర్పాటు చేసుకున్నా రు. ఆలయ ప్రాంగణంలో జాతర వెలిసింది.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, ఫిబ్రవరి 11 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఒడిబియ్యం, పట్టెనామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

బాలికల కుస్తీమే సవాల్

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 11 : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న అల్లమాప్రభు జాతర ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామకమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాలికలు తలపడడం ఆసక్తి రేకెత్తించింది. వరంగల్‌కు చెందిన రమ్య, హైదరాబాద్‌కు చెందిన సిద్ర తలపడగా, రమ్య మొదటి బహుమతి సాధించింది. సిద్ర రన్నర్‌గా నిలిచింది. వీరిని ఎంపీపీ విఠల్, ఎస్సై లావణ్య అభినందించారు. మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3వేలు అందించినట్లు మాజీ సర్పంచ్ అన్నం సత్యనారాయణ తెలిపారు. చివరి కుస్తీ గెలిచిన మల్లయోధుడికి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి రూ.2001 నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుస్తీలో తలపడుతున్న రమ్య, సిద్ర

విజేతను ప్రకటిస్తున్న ఎస్సై లావణ్య

నిజాంసాగర్ ఎస్సైగా సుధాకర్

నిజాంసాగర్, ఫిబ్రవరి 11: స్థానిక ఠాణాలో ఎస్సైగా పనిచేసిన రాజశేఖర్ బీర్కూర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న సుధాకర్ రానున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వచ్చిన రాజశేఖర్ ఆరు నెలలపాటు విధులు నిర్వహించి మండల ప్రజల మన్ననలు చూరగొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

విక్రంగౌడ్(ఫైల్)

గాంధారి, ఫిబ్రవరి 11: మండలకేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారికి చెందిన కడెం విక్రం గౌడ్ (19) శనివారం తన స్నేహితుడు లింగమేశ్వర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం లింగమేశ్వర్‌తో పాటు మరో స్నేహితుడు సందీప్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా, గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో డివైడర్‌ను వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న విక్రమ్‌గౌడ్ ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నారాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

దోమకొండ, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఆదివారం ప్రారంభమైంది. ఆలయంలో ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, కొట్టాల గడ్డ పద్మశాలీ సభ్యులు దామోదర్, ఆనంద్, విజయ్, జగదీశ్, సురేశ్, ప్రవీణకుమార్, హరి శంకర్, చంద్రబాబు, ప్రేమ్‌కుమార్, సంతోష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

14న ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 11 : పట్టణంలోని సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచి బాబాకు విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు రథయాత్ర, పల్లకీ సేవ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మార్కండేయ జయంతి

దోమకొండ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో మార్కండేయ జయంతిని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ఉమా మహేశ్వర, సీతారాముల కల్యాణోత్సవం, నవగ్రహ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఉచిత విద్యుత్ కోసం వివరాల సేకరణ

నిజాంసాగర్/రాజంపేట్, ఫిబ్రవరి11: గృహజ్యోతి పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఉచిత విద్యుత్ కోసం మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో ట్రాన్స్‌కో అధికారులు ఆదివారం వివరాలు సేకరించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారి ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డు, మీటరు నంబర్ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జూనియర్ లైన్‌మన్లు ఖదీర్, రాజు, కాంగ్రెస్ నాయకులు ఆకాశ్, తోట రాజు, సంగమేశ్వర్, తుకారాం పాల్గొన్నారు.

రాజంపేట్ మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ఉచిత విద్యుత్ అందించేందుకు అధికారులు సర్వే చేశారు. దరఖాస్తు దారుల ఇండ్లకు వెళ్లి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏఈ మారుతి, లైన్‌మన్ మహ్మద్ హుస్సేన్, జేఎల్‌ఎం శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాచారెడ్డి, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్యాంసుందర్, భాస్కర్‌గౌడ్, పిట్ల శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, లింగం, బాల్‌రాజు, రమేశ్, సతీశ్, అశ్రఫ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి ఎంపీడీవో బదిలీ

మాచారెడ్డి, ఫిబ్రవరి 11 : మాచారెడ్డి ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న బాలకృష్ణ నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆదివారం ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేయగా బాలకృష్ణను నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. మాచారెడ్డి ఎంపీడీవోగా బాలకృష్ణ దాదాపు 5 సంవత్సరాలు పనిచేశారు.